


# రాగి చెంబులో చేపపిల్ల

శ్రీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

సుబ్బమ్మగారు పండు ముత్తయిదువు. డెబ్బై ఏళ్ళు దాటుతున్నా కాయబారు మనిషి. నడుం వంగలేదు, చూపు తగ్గలేదు. నిప్పుల మీద నీళ్ళు చల్లేటంత ఆచారం. నిప్పుతో నీళ్ళని శుద్ధిచేసేటంత వీర మడి. ఈ ముక్క మాటవరస కనడంలేదు. సుబ్బమ్మగారింట్లో నీళ్ళ గాబు చూస్తే అక్కడ బొగ్గులు తేల్తూ కనిపిస్తాయి. వొడ్డిరవాళ్ళు కృష్ణ నుంచి తీసుకొచ్చి పోసిన నీళ్ళు కనుక మండుతున్న కట్టెపేడు ఒకటి తీసుకెళ్ళి ఆ గాబులో ముంచుతుంది. అప్పుడు ఆ నీళ్ళు శుద్ధి అయినట్టు.

అలా శుద్ధి అయిన నీళ్ళతో కళ్లాపుజల్లి, ముగ్గువేసి ఆపైన వంటిల్లు అలుక్కుని, పొయ్యి అలికి అక్కడ మళ్ళీ ముగ్గువేసి కృష్ణకి స్నానానికి బయల్దేరేప్పటికి తొమ్మిదవుతుంది. కావిళ్ళతో నీళ్ళు తెచ్చేవాళ్ళకి దూరంగా నడుస్తూ దోవలో కావమ్మగారింట్లో కరవేపాకడిగి, రామయ్యగారి దొడ్డి దగ్గరకొచ్చేసరికి రామయ్యగారి క్రి ఆవు సుబ్బమ్మగార్ని చూసి బుసలు కొడుతుంది. సుబ్బమ్మగారికి ఆ ఆవంటే గొప్ప భక్తి. అదేం ఖర్మమో! ఆ ఆవు ఈవిడ్ని చూడ్డం ఆలస్యం కొమ్ములు విసుర్తూ పలుపు తెంపుకోబోతుంది. సుబ్బమ్మగారు చిన్నబుచ్చుకున్న ముఖంతో బతిమిలాడ్తూ "మా అమ్మకదూ! మా తల్లికదూ! మా పార్వతీదేవి కదూ! అమ్మా! అమ్మా!" అంటూ ప్రార్థిస్తుంది. ఊహూ. ఆ ఆవు వినదు. రుసరుసలాడ్తూ కదం తొక్కుతుంది. ఇక లాభంలేదని రామయ్యగారి పాలేర్ని పిలిచి పలుపు పట్టుకోమని సుబ్బమ్మగారు ఆవు వెనక్కు వెళ్ళి ఆవు పంచితం తలమీద చల్లుకుని దణ్ణం పెట్టుకుని కృష్ణ రేవులోకొచ్చేసరికి పదిగంటలవుతుంది. బట్టలుతుక్కుని స్నానానికి నీళ్ళలోకి దిగేసరికి మరో గంట. సుబ్బమ్మగారి స్నానమయ్యేసరికి సూర్యుడస్తమిస్తాడని వాడుక. ఆవిడ స్నానం చూడవలసిందే! ఎన్ని వందలసార్లు నీళ్ళలో మునుగుతుందో చెప్పలేము. ఒక్కొక్క దేవుడి పేరున ఒక్కో మునక. దిక్కు దిక్కుకూ తిరిగి వందనాలు, ప్రదక్షిణాలు. పేరు పేరునా అర్ఘ్యాలు. అలా మునిగి మునిగి ఉతికిన బట్టలు భుజాన వేసుకుని బిందెతో నీళ్ళు ముంచుకుని ఒడ్డుకి పదడుగులు వేసేదో లేదో ఆ బిందెడు నీళ్ళు పారబోసేది. కారణం ఏవీలేదు. ఏ ఉప్పర పరవయ్యో ఎదురుగా వచ్చేవాడు అంతే. మళ్ళీ కృష్ణలో మునిగి నీళ్ళు ముంచుకు పైకొచ్చి, అన్నం మెతుకు కాలికిందపడిందని మళ్ళీ నీళ్ళు పారబోసేది. మళ్ళీ మునక. మళ్ళీ నీళ్ళ బిందె. వస్తుంటే చింతచెట్టు మీంచి కొంగ రెట్ట వేసిందేమో అన్న అనుమానం కొద్దీ మళ్ళీ నీళ్ళు పారబోసేది. ఇలా పారబోసిన నీళ్ళతో రేవు రేవంతా బురదయ్యేది. అనేక గండాలు తప్పించుకుంటూ మంచినీళ్ళ బిందె ఇంటికి చేరడానికి గంటపైగా పట్టేది.

పన్నెండు గంటలు దాటుతున్న వేళ పొయ్యి రాజేసేది. నడుస్తున్న నేలంతా మడినీళ్ళు చల్లుకుంటూ వండుతున్న ప్రతి వస్తువుమీద మడి నీళ్ళు చిలకరిస్తూ వంట సాగించేది. సుబ్బమ్మగారి భర్త సత్యనారాయణగారు పిల్లలకి పాఠాలు చెప్పి చెప్పి ఆకలి లోపల ఉరకలు వేస్తుంటే నీరసంగా స్తంభానికి ఆనుకుని కూర్చునేవాడు. ఎంతసేపటికీ వంటింట్లోంచి పిలుపు రాదు. కాసేపు వంటింటివైపు, కాసేపు మార్లో పిచ్చికల వైపు చూస్తూ నిముషాలు లెక్కపెడ్తుండేవాడు. ఒంటిగంట ఒంటిగంటన్నరకు వంటవగా, అప్పుడు దొడ్లో తులసికోట దగ్గర పూజ ప్రారంభించేది సుబ్బమ్మగారు. తులసెమ్మకు నీళ్ళు పోసి, ప్రదక్షిణాలు చేసి స్తంభానికంటుకుపోయిన భర్తనుద్దేశించి "స్నానానికి లేవండి" అనేది. సత్యనారాయణగారు ఆ పిలుపందుకుని చెంగున లేచి గాబులో నీళ్ళు నాలుగు చెంబులు నెత్తిన గుమ్మరించుకుని ధావళీ కట్టుకుని పీటమీద వాలేవాడు. ఆయన భోజనం అయ్యేక తను వడ్డించుకుని తిని ఎంగిళ్ళెత్తి సుబ్బమ్మగారు మైలపడేసరికి మూడు దాటేది.

అలా ఒకరోజున భోజనం ముగించుకుని వరండాలో పీట తలకింద పెట్టుకుని సుబ్బగారు చెంగు వాల్చుకు పడుకుంటే ఆవిడకి వున్నట్టుండి దాహమేసింది. మొదట్లో లేవడానికి బద్ధకించి అలాగే పడుకుంది. ఆ రోజున పండు మిరపకాయల కారంలో నెయ్యి ఎక్కువేసుకుందేమో దాహం ఆగలేదు. లేచి వంటింట్లోకెళ్ళి రాగి చెంబుతో నీళ్ళు ముంచుకుని సగం తాగి చెంబులోకి చూస్తే- ఇంకేముంది? కొంప మునిగింది- 'శివశివా!' అంటూ చెంబు వదిలేసి తనూ పడిపోయింది. ఆ మోతకి నిద్రపోతున్న సత్యనారాయణగారు ఉలిక్కిపడి లేచి పరుగెత్తుకొచ్చారు.

చూస్తే - ఆ రాగి చెంబు నీళ్ళలో అడుగున చేపపిల్ల.

ముత్యాల వాన

తలుపోసుకుని చెంగు కళ్ళకడ్డం పెట్టుకుని కుమిలిపోతోంది సుబ్బమ్మగారు. "ఆ నీళ్ళతోనే అన్నం వండింది. ఆ నీళ్ళతోనే పప్పు చేసింది. ఆ నీళ్ళతోనే పచ్చడి నూరింది. ఆ నీళ్ళతోటే దేవుడికి నైవేద్యం పెట్టింది. అవే తాగింది. అట్లా తన మడి మండిపోయింది. "కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది సుబ్బమ్మగారు.

అలా ఏడుస్తున్న సుబ్బమ్మగార్ని చూసి సత్యనారాయణగారన్నారు "పిచ్చిదానా! నువ్వు స్నానంచేసే కృష్ణలో చేపలు లేవా? వొడ్డిర పరవాయి మైలా? నువ్వు తినే అన్నం కాలికి తగిల్తే మైలా? నీ లోపల మైల లేదా?" సుబ్బమ్మగారు కళ్ళెత్తి చూసింది. ఎవర్నీ అంటకుండా మడిగా ముత్యపు చిప్పలో ముత్యంలా బతకాలనుకుంది. నీళ్ళలో చేపలా బతకాలని తెలిసింది కాదు. అందుకేనేమో రామయ్యగారి క్రి ఆవు తనని చూస్తే పొడవడానికొస్తుంది.

## "వైక్యూజ్ మి"

మా బావమరిది కొడుకు యు.కె.జి. చదువుతున్నాడు. ఓ రోజు వాడు స్కూలు నుంచి రాగానే 'అమ్మా! మా మేడం లోపలికి వచ్చేముందు ఎక్స్‌క్యూజ్ మి' అని అడగాలని అన్నారు. అలా అడగాలా అన్నాడు. మా చెల్లెలు అవునంది. వాడు అమాయకంగా 'మరి లోపలి నుంచి బయటి కెళ్లేటప్పుడు వైక్యూజ్ మి అని అడగాలి కదూ!' అన్నాడు.

—డి.వి.వి. సత్యనారాయణ

## ఎలా

తీర్థయాత్రలకు వెడుతూ విజయవాడలో దిగాడు పుల్లయ్య.

'కనకదుర్గమ్మ గుడికి ఎలా వెళ్లాలండి' దారిన పోయే దానయ్యను అడిగాడు.

'నడిచి వెళ్లొచ్చు. రిక్షాలో వెళ్లొచ్చు. డబ్బుంటే కారు మీద కూడా వెళ్లొచ్చు. నీ ఓపిక' అంటూ వెళ్లిపోయాడా దానయ్య.

—కె.వి.మధుసూదనరావు, కాకినాడ.